లెటర్ నెం. 1/2017

పార్టీ సభ్యులకు

# రాజకీయ ఖైదీల విడుదల కోసం పోరాటాలు తీవ్రతరం చేయండి!

# కామ్రేడ్ జతీన్ దాస్ 88వ వర్ధంతి సందర్భంగా

# సెప్టెంబర్ 13ను రాజకీయ ఖైదీల విడుదల పోరాట దినంగా

# పాటించండి!

లెటర్ నెం. 1/2017 పార్టీ సభ్యులకు

# రాజకీయ ఖైదీల విడుదల కోసం పోరాటాలు తీవ్రతరం చేయండి!

# కామ్రేడ్ జతీన్ దాస్ 88వ వర్ధంతి సందర్భంగా

# సెప్టెంబర్ 13ను రాజకీయ ఖైదీల విడుదల పోరాట దినంగా

# పాటించండి!

**ప్రియమైన కామ్రేడ్స్!**

2017, సెప్టెంబర్ 13న విప్లవకారుడు, భగత్‌సింగ్ సహచరుడు, అమరుడు కామ్రేడ్ జతీన్ దాస్ 88వ వర్ధంతిని జరుపుకోబోతున్నాం. ఆయన 1929 సంవత్సరంలో ఇదే రోజున లాహోర్ జైలులో సమరశీల ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి 63వ రోజున అమరుడయ్యాడు. జైలు నిర్బంధంలో ఉన్న విప్లవకారులు కామ్రేడ్ భగత్‌సింగ్ నాయకత్వంలో ఖైదీల హక్కుల కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడేవారిని సాధారణ నేరస్తులుగా కాక రాజకీయ ఖైదీలుగా గుర్తించాలనేది వారి డిమాండ్లలో ప్రధానమైంది. వీటితో పాటు సరైన ఆహారం, కనీస సదుపాయాలు, చదవడానికి, రాయడానికి అవసరమైన సామగ్రి సమకూర్చడం తమొదలైన డిమాండ్లు కూడా ఉన్నాయి. వారు చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష రోజులు గడిచే కొలదీ వారి ఆరోగ్య స్థితి దిగజారసాగింది. అందరి కంటే జతీన్ దాస్ ఆరోగ్యం బాగా క్షీణించింది. సహచరులు వైద్యం కోసం అంగీకరించాల్సిందిగా అతనికి నచ్చజెప్పజూశారు. తమ డిమాండ్లు నెరవేరేవరకూ ప్రాణత్యాగానికైనా సిద్ధపడ్డాడే గానీ కా.జితిన్ వైద్యానికి అంగీకరించలేదు. తుదకు 63 రోజుల నిరాహార దీక్ష పర్యవసానంగా కామ్రేడ్ జతీన్ దాస్ అంతిమ శ్వాస విడిచాడు. ఆయన భౌతికకాయాన్ని లాహోర్ నుంచి కోల్‌కతాకు తీసుకెళుతుండగా, ప్రతి రైల్వేస్టేషన్‌లో వేలాది మంది ప్రజలు ఆ అమరవీరునికి శ్రద్ధాంజలి ఘటించారు. కోల్‌కతాలోత 4 లక్షల మంది ప్రజలు కామ్రేడ్ జతీన్ దాస్ అంతిమ యాత్రలో సమీకృతులై విప్లవ జోహార్లు అర్పించారు.

గొప్ప దేశభక్తులు, విప్లవకారులు అయిన కామ్రేడ్స్ భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు, తదితరుల విప్లవ కార్యకలాపాలన్నీ మనకు ప్రేరణాదాయక పాఠాలే. వారు జైలు జీవితం గడిపిన కాలమంతా బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు, జైలు అధికారులకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడుతూ ఎన్నో ఉన్నత పోరాట సంప్రదాయాలను నెలకొల్పారు.త వారు జైలునే విప్లవ పాఠశాలగా మార్చడమే గాక, "ఇంక్విలాబ్ జిందాబాద్" అనే సందేశాన్ని జైలు నాలుగు గోడల మధ్య నుండి కూడా దేశ ప్రజలకు అందించారు. చిరునవ్వుతో ఉరికంబాలు ఎక్కి తమ

ప్రాణాలను అర్పించారు. వారి పోరాట పటిమత దేశ ప్రజల్ని ఇప్పటికీ ఉత్తేజపరుస్తున్నది. నేడు జైళ్లలో మగ్గుతున్న విప్లవకారులకు ఎంతో మనోధైర్యాన్ని యివ్వడమే గాక వారికి పోరాట మార్గాన్ని చూపెడుతున్నది. కామ్రేడ్ జతీన్ దాస్ ప్రాణ త్యాగం చేసిన దినాన్ని పురస్కరించుకొని మన కేంద్రకమిటీ ఆయనకు వినమ్రంగా విప్లవాంజలి ఘటిస్తున్నది. సెప్టెంబర్ 13ను రాజకీయ ఖైదీల విడుదల పోరాట దినంగా పాటించాల్సిందిగా, జైళ్లలో బందీలుగా కామ్రేడ్స్ సాగిస్తున్న పోరాటాలకు మద్దతుగా దేశవ్యాప్తంగా బలమైన రాజకీయ ఖైదీల విడుదల ఉద్యమాన్ని బలంగా నిర్మించాతల్సిందిగా కేంద్రకమిటీ పిలుపునిస్తోంది.

**కామ్రేడ్స్!**

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్రత్యక్షపాలన పోయినా మన దేశ పరిస్థితుల్లో మౌలిక మార్పేమీ రాలేదు. 1947లో లభించింది బూటకపు స్వాతంత్ర్యం మాత్రమే. దేశ బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా పాలకవర్గాలు ఒకపక్క మన దేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశమనీ, సార్వభౌమాధికారం కలిగిన దేశమనీ చెప్పుకుంటున్నాయి. మరోపక్క దేశ సంపదలను, సహజ వనరులను, శ్రమశక్తినీ సామ్రాజ్యవాదులకు కారుచౌకగా తెగనమ్మివేస్తూ అర్ధవలస, అర్ధభూస్వామ్య సామాజిక వ్యవస్థను పరిరక్షిస్తున్నాయి. భూస్వామ్య, సామ్రాజ్యవాద అనుకూల విధానాలు, కార్మిక-కర్షక తదితర పీడిత ప్రజలకు వ్యతిరేకమైన విధానాలు అమలు చేస్తున్నాయి. ఫలితంగా ప్రజల బ్రతుకులు దుర్భరంగా మారిపోయాయి. ఈ స్థితిని మార్చేందుకు సామ్రాజ్యవాదాన్నీ, బడా భూస్వామ్య, దళారీ నిరంకుశబూర్జువా వర్గాలనూ కూలదోసి అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ స్థానంలో కార్మికులు, రైతాంగం, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలకు ప్రాతినిధ్యం వహించే నూతన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించే లక్ష్యంతో మన పార్టీ నాయకత్వంలో దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో సాయుధ పోరాటం కొనసాగుతున్నది. మరో వైపు పీడిత జాతులైన కశ్మీర్, నాగా, మణిపూర్, అసోం, బోడో జాతి ప్రజలు తమ విముక్తి కోసం దశాబ్దాలుగా సాయుధంగా పోరాతున్నారు. దేశవ్యాప్తంగా యావత్తు పీడిత వర్గాలు, సెక్షన్లు తమ సమస్యలపై పాక్షిక, రాజకీయ పోరాటాలు, ప్రజాస్వామిక ఉద్యమాలు కొనసాగిస్తున్నాయి. దోపిడీ వర్గ స్వభావం కలిగిన భారత రాజ్యాంగయంత్రం ఈ న్యాయమైన పోరాటాలు, ఉద్యమాలపై తీవ్ర ఫాసిస్టు అణచివేతను అమలు జరుపుతున్నది. ఫలితంగా దేశంలోని జైళ్లు నరకకూపాలుగా మారిపోతున్నాయి. ఈ దోపిడీ వర్గ రాజ్యాంగయంత్రాన్ని కార్మికవర్గ నాయకత్వాన సాయుధంగా ధ్వంసం చేసి దాని స్థానంలో కార్మిక, కర్షక సమైక్యతపై ఆధారపడిన నాలుగు వర్గాల రాజ్యాంగయంత్రాన్ని స్థాపించకుండా ఈ దేశ ప్రజలకు విముక్తి లేదు.

## నిర్బంధ శిబిరంగా మారిపోతున్న దేశం

దళారీ పాలకవర్గాలు 1990ల నాటి నుండి అమలు చేస్తున్న సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్.పి.జి.) విధానాల ఫలితంగా గత 26 సంవత్సరాలలో దోపిడీ, పీడన, అణచివేత తీవ్రస్థాయికి చేరుకోవడంతో ప్రజల బ్రతుకులు మరింత దుర్భరమయ్యాయి. సామ్రాజ్యవాద బహుళ జాతి కార్పోరేషన్, కార్పొరేట్ వర్గాలు తమ ఇష్టానుసారంగా దోచుకునేందుకు, వారికి సూపర్ లాభాలను చేకూర్చేందుకూ ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలో ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులను అనుమతించడంతో దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. తీవ్రమవుతున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో దోపిడీ వర్గాలకు సూపర్ లాభాలు చేకూర్చిపెట్టే స్థలంగా దేశం మారిపోవడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజల బతుకులు కునారిల్లి పోతున్నవి. మరోవైపు దేశ ప్రజలకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులు నానాటికీ హననమైపోతున్నాయి. అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు. తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో రైతాంగం తమ వ్యవసాయక సమస్యలపై మిలిటెంటుగా పెద్దెత్తున కదిలితే వారిపై ప్రభుత్వ సాయుధ బలగాలను ప్రయోగించి క్రూరమైన దమనకాండను అమలు చేశారు. దేశంలో పోరాడుతున్న ప్రతి పీడిత వర్గమూ, సెక్షనూ, జాతీ తీవ్ర నిర్బంధానికి గురవుతున్నది. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు అడుగంటిపోతున్నాయి. పోరాడే ప్రజల సమస్త హక్కుల్ని కాలరాసే అనేక క్రూరమైన చట్టాలను రూపొందిస్తున్నారు. పీడిత ప్రజలు కొనసాగిస్తున్న న్యాయమైన పోరాటాలపై వీటిని ప్రయోగిస్తూ నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారు.

బిజెపి అధికారం చలాయిస్తున్న కేంద్రంలోనూ, వివిధ రాష్ట్రాల్లోనూ సంఘ్‌పరివార్‌కు చెందిన పలు ప్రతీఘాతుక హిందూ సంస్థలు వివిధ పేర్లతో పుట్టుకొస్తున్నాయి. ఇవి హిందూ రాజ్య స్థాపన లక్ష్యంతో గో రక్షణ, ఘర్ వాపసీ తదితర పేర్లతో మత మైనారిటీలపై, దళితులు, ఆదివాసులు, విద్యార్థులు, ప్రొఫెసర్లు, మహిళలు తదితర సెక్షన్లపై అడ్డూఅపూ లేకుండా హత్యలు, అత్యాచారాలకూ పాల్పడుతున్నాయి. వీటి ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, మేధావులు, ప్రొఫెసర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు, హెల్త్ వర్కర్లు, నిరుద్యోగులు, దళితులు తదితర పీడిత కులాల ప్రజలు, ఆదివాసులు, మత మైనారిటీలైన ముస్లిములు, క్రైస్తవులు తమ జీవన పరిస్థితుల మెరుగుదల కోసం, ఆత్మగౌరవం కోసం, సామాజిక, రాజకీయ మౌలిక సమస్యల పరిష్కారం కోసం, భూమి, అధికారం, విముక్తి కోసం పోరాడుతున్నారు. కశ్మీర్, అసోం, నాగాలాండ్, మణిపూర్ తదితర జాతులు స్వయంనిర్ణయాధికారం సహా విడిపోయే హక్కు కోసం, గూర్ఖాలాండ్, విదర్భ సహా అనేక చోట్ల ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడుతున్నారు.

ఈ సమస్యల్ని పరిష్కరించడంలో విఫలమవుతున్న ప్రభుత్వాలు ఆయా ఉద్యమాలను తీవ్రంగా అణచివేస్తున్నాయి. పోరాడుతున్న ప్రజలపై పోలీసులు నిర్దాక్షిణ్యంగా లాటీచార్జీలు చేస్తూ చితకబాదుతున్నారు. లాటీచార్జీల వల్ల తలలు పగిలిపోవడం, కాళ్లు చేతులు, ఇతర శరీర భాగాలు విరిగి ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారు. ఫాసిస్టు ప్రభుత్వ అనేక బలగాలు విచ్చలవిడిగా కాల్పులు జరపుతూ పోరాటకారులను, ప్రజలను కాల్చి చంపుతున్నాయి. వేలాది మందిని అరెస్టు చేసి అక్రమ కేసుల్లో ఇరికించి జైలు పాలుజేస్తున్నాయి. 2016 జులై నుండి కొనసాగుతున్న కశ్మీర్ జాతి విముక్తి పోరాట నూతన వెల్లువను అణచివేసేందుకు ఇప్పటివరకు వందకు పైగా మందిని చంపి, 8 వేలకు పైగా యువతను జైళ్లల్లో కుక్కాయి. అనేకమందిని మాయం చేశాయి. ప్రజా ఉద్యమాలతో వ్యవహరించేటప్పుడు వీలైనంత తక్కువగా బలప్రయోగం చేయాలని సుప్రీంకోర్టు అనేక సార్లు పోలీసు, పారా మిలటరీ బలగాలకు ఆదేశాలు జారీ చేసినా, మానవహక్కుల కమీషన్ల వంటి ప్రభుత్వ ఏజెన్సీలు పెద్దెత్తున జరుగుతున్న లాకప్పు హత్యలు, మహిళలపై అత్యాచారాలు, పోలీసు చిత్రహింసల గురించి ఎన్ని నివేదికలు వెలువరిస్తున్నా వాటిని అవి లెక్కచేయడం లేదు.

దేశ అంతర్గత భద్రతకు 'అతి పెద్ద ప్రమాదంగా' ఉన్నదంటూ విప్లవ, ప్రజాస్వామిక ఉద్యమాలను అణచివేయడంలో భాగంగా గత సంవత్సరం మిషన్ 2016, ఆ తర్వాత ప్రస్తుతం మిషన్ 2017 పేరిట భారత దోపిడీ పాలకవర్గాలు ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దశను తీవ్రతరం చేశాయి. వివిధ బహుళజాతి సంస్థల ప్రతిపాదిత పరిశ్రమలు, ప్రాజెక్టులు, గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా జల్-జంగల్-జమీన్-ఇజ్జత్- అధికార్ కోసం పోరాడుతున్న ఆదివాసులపై, రైతాంగంపై నిర్దాక్షిణ్యంగా అణచివేత దాడులు సాగిస్తున్నాయి. అనాదిగా జీవిస్తున్న తమ జన్మస్థలాలను, వ్యవసాయ భూములను, అడవులను వదిలి వెళ్లడానికి నిరాకరించినందుకు, తమ గ్రామాలను, అడవులను, పర్వతాలను, నదులను మాత్రమే కాక, తమ జీవన విధానాన్ని, సంస్కృతిని పరిరక్షించుకునేందుకు, మంచి భవిష్యత్తు కోసం పోరాడుతున్నందుకు ప్రజలను అరెస్టు చేసి వివిధ అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఎంతోమందిని ఎటువంటి జాడ లేకుండా మాయం చేస్తున్నారు. ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చిచంపుతున్నారు. గత సంవత్సరం 165 మంది, ఈ సంవత్సరం ఇప్పటి వరకూ 65 మంది మావోయిస్టులను, ప్రజలను మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో హత్య గావించారు.

2017 మార్చిలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పార్లమెంటుకు సమర్పించిన నివేదిక ప్రకారం మావోయిస్టు సంబంధిత కేసులలో గత సంవత్సర కాలంలో 1,100 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిపై థర్డ్ డిగ్రీ చిత్రహింసలు పెడుతున్నారు. బస్తర్ డివిజన్‌లో 14-16 యేళ్ల ఆదివాసీ యువతులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ల నుంచి మహిళా పోలీసులను బయటకు పంపి, వారిని నగ్నంగా చేసి అత్యాచారాలకు గురిచేస్తున్నారు.

చేతులపై, స్తనాలపై కరెంటు షాకులు ఇస్తున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం 5వ షెడ్యూల్‌లో భాగమైన ఆదివాసీ ప్రాంతాల నుంచి ఆదివాసులను తరిమివేస్తున్నారు. వారి సాంప్రదాయక జీవనాన్ని ధ్వంసం చేస్తున్నారు. వారు ఏర్పరచుకుంటున్న నూతన విప్లవ అధికార నిర్మాణాన్ని ధ్వంసం చేసి, ఆ ప్రాంతాలను దేశ–విదేశీ కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు గ్రామాలను తగులబెడుతున్నారు. విప్లవోద్యమాన్ని అణచివేయడానికి మహిళలపై లైంగిక అత్యాచారాలను ఒక ఆయుధంగా వినియోగిస్తున్నారు. గ్రామస్థులు సరెండర్ కావాలనీ, ఇన్‌ఫార్మర్లుగా మారాలనీ, వివిధ పోలీసు, పారామిలటరీ, మిలటరీ బలగాల్లో చేరాలని నిరంతరం వత్తిడి చేస్తున్నారు. భ్రమలకు లోను చేస్తున్నారు. పోలీసుల వేదింపులు భరించలేక ప్రజలు చాలాచోట్ల తమ ఊళ్లు వదిలి పారిపోవాల్సి వస్తోంది.

రాజ్యం తనకు వ్యతిరేకంగా వ్యక్తమయ్యే ఎటువంటి నిరసనను అయినా కాలరాచివేసేందుకు ఉపా (యు.ఏ.పి.ఏ.), అఫ్‌స్పా (ఏ.ఎఫ్.ఎస్.పి.ఏ.) తదితర క్రూర చట్టాల కింద కేసులు మోపుతున్నది. ప్రజా వ్యతిరేక, అన్యాయ, అణచివేత ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలపై, ప్రత్యేకించి మహిళలపై పోలీసులు కొనసాగిస్తున్న హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా గొంతెత్తే, వీటిపై పరిశీలన జరిపి వెలుగులోకి తెచ్చే, ప్రజాపక్షం వహించే ప్రతి ఒక్కరిపైనా దాడి చేస్తున్నది. రాజ్యం విప్లవ, ప్రజాస్వామ్య, జాతివిముక్తి పోరాటాలకు వ్యతిరేకంగా ప్రతిఘాతుక ఉద్యమాలను రెచ్చగొట్టడం, తెల్ల బీభత్సాన్ని కొనసాగించడం వల్ల దేశంలో నామమాత్రమే మానవహక్కులకైనా అర్థం లేకుండాపోయింది.

విప్లవోద్యమ ప్రాంతాల్లో గ్రామస్థులను, ప్రజాస్వామికవాదులను, సామాజిక, పౌరహక్కుల కార్యకర్తలను, ప్రజాశ్రేయోభిలాషులను, న్యాయవాదులనచచు, విలేకరులను, చివరికి పాలకవర్గ ప్రతిపక్ష పార్టీ నాయకులను కూడా వెంటాడడం, బెదిరించడం, భౌతిక దాడులు చేయడం, 'మావోయిస్టుల' పేరుతో ఉపా తదితర క్రూర చట్టాల కింద అరెస్టు చేసి జైల్లో బంధించడం, ఉద్యమ ప్రాంతాల నుంచి తరిమికొట్టడం పోలీసుల, విప్లవ ప్రతీఘాతుక సంఘాల కర్తవ్యంగా మారింది. బస్తర్‌లో కొనసాగుతున్న పోలీసు రాజ్యం గురించి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించిన భారతీయ మహిళల జాతీయ సమాఖ్య (NFIW), అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కార్యకర్తలపై ఛత్తీస్‌గఢ్ ప్రజా భద్రతా చట్టం కింద కేసు నమోదు చేయాలని విప్లవ ప్రతిఘాతుక సంస్థలు డిమాండ్ చేశాయి. దండకారణ్యంలో అగ్ని, భూంకాల్ సంఘటన్ వంటి వివిధ విప్లవ ప్రతీఘాతుక సంఘాలను ముందుకు తేవడం ద్వారా సుప్రీంకోర్టు తీర్పును సైతం ఉల్లంఘిస్తూ ప్రభుత్వాలు సల్వాజుడుంను పునరుద్ధరిస్తున్నాయి.ఎంపిక చేసిన వివిధ పోలీసు, పారామిలటరీ బలగాల నుంచి, మావోయిస్టు వ్యతిరేక శక్తుల నుంచి, లొంగిన నక్సల్స్‌తో, డిఆర్‌జి వంటి విప్లవ ప్రతీఘాతుక కిరాయి కమాండో బలగాలను ఏర్పాటు చేస్తున్నాయి. బీహార్–ఝార్ఖండ్‌లలో టిపిసి, జెజెఎంపి వంటి పలు రాజ్య ప్రాయోజిత విప్లవ ప్రతీఘాతుక

ముతాలు క్రియాశీలంగా ఉన్నాయి. పోలీసు ఆపరేషన్లలో విప్లవ కార్యకర్తలను, ప్రజలను చంపడం, మహిళలపై సామూహిక అత్యాచారాలు, గృహదహనాలు, ఆస్తుల విధ్వంసం, లూటీ చేయడంలో ఈ బలగాలే ముందుంటున్నాయి.

ఆదివాసులకు లీగల్ సహాయాన్ని అందించడం కోసం ఏర్పడిన 'జగదల్‌పూర్ లీగల్ ఎయిడ్ గ్రూపు' (జగ్‌లాగ్) న్యాయవాదులను ఇటువంటి విప్లవ ప్రతీఘాతుక శక్తులే భయోత్పాతానికి గురిచేసి 2016 ఫిబ్రవరిలో అక్కడి నుండి కొందరిని వెళ్లగొట్టాయి. వారిని "బయటవారు" అంటూ జగదల్‌పూర్, దంతేవాడ జిల్లాల బార్ అసోసియేషన్‌లలో స్థానికతత్వాన్ని రెచ్చగొడుతూ ఆదివాసులకు న్యాయాన్ని అందకుండా చేశాయి. లాయర్ల, క్లయింట్ల ప్రయోజనాల్ని పరిరక్షించాల్సిన బార్ అసోషియేషన్‌లు రాజ్యాంగ విరుద్ధంగా క్రిస్టియన్ల, దళితుల, మావోయిస్టుల కేసులను ఏ ఒక్క లాయరూ చేపట్టరాదని 'ఖాప్ పంచాయితీల' స్థాయికి దిగజారాయి.

2011లో తాడిమెట్ల అగ్నికాండ–హత్యాకాండకు పాల్పడింది బస్తర్ ఐజి ఎస్‌ఆర్‌పి కల్లూరి నాయకత్వంలో ఎస్‌పిఓలు, సల్వాజుడుం కార్యకర్తలు, సిఆర్‌పిఎఫ్ బలగాలేననీ సిబిఐ తన చార్జిషీటును సుప్రీం కోర్టులో దాఖలు చేసింది. దీనికి నిరసనగా డిఆర్‌జి పోలీసులు, సహాయక్ ఆరక్షక్‌లు (గతంలో ఎస్‌పిఓలు) 'తిరుగుబాటు' చేశారు (కోర్టు ధిక్కారణ చేశారు). సామాజిక కార్యకర్తల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. అలా చేసినందుకు కల్లూరి వారిని అభినందించాడు. గత డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి బస్తర్‌కు వెళ్లిన 7 గురు సభ్యులతో కూడిన నిజనిర్ధారణ కమిటీలోని ప్రముఖ ప్రజా సంఘ నాయకులపై సుక్మా జిల్లాలో ఒక విప్లవ ప్రతీఘాతక గ్యాంగు దాడి చేసి అవమానించింది. వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించి ఛత్తీస్‌గఢ్ ప్రజా భద్రతా చట్టం కింద తప్పుడు కేసులో ఇరికించి జైలులో పెట్టించింది. నిర్దోషులైన ఆదివాసులను అక్రమంగా, విచక్షణారహితంగా అరెస్టు చేస్తున్నందుకు చివాట్లు పెడుతూ పోలీసులకు కంట్లో నలుసుగా మారాడని సుక్మా జిల్లాలో ప్రథమ శ్రేణి జుడీషియల్ మెజిస్ట్రేట్ ప్రభాకర్ గ్వాల్‌ను 'ప్రజా ప్రయోజనం' పేరిట ఉద్యోగం నుంచి తొలగించారు. బుర్కపాల్ దాడి నేపథ్యంలో మావోయిస్టుల పేరుతో అమాయకులైన ఆదివాసులను అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారంటూ రాయపూర్ సెంట్రల్ జైలులోని ఉపజైలర్ వర్షా డోంగరే తన ఫేస్‌బుక్‌పై అడ్రస్ చేసినందుకు ఆమెను తక్షణం సస్పెండ్ చేశారు. తాడిమెట్ల హత్యాకాండలో పోలీసులే దోషులంటూ సిబిఐ, ఆదివాసీ మహిళలపై పోలీసులు సామూహిక అత్యాచారాలకు పాల్పడ్డారంటూ కేసుల్లో జాతీయ మానవ హక్కుల కమీషన్, వివిధ ఎన్‌కౌంటర్ కేసులలో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు పోలీసులను తప్పుపట్టాల్సిన స్థితి ఏర్పడిందంటే బస్తర్‌లో రాజ్యమేలుతోన్న పోలీసు హింసను అర్థం చేసుకోవచ్చు.

కేరళంలో కామ్రేడ్ కుప్పు దేవరాజ్, అజితలను పోలీసులు నీలంబర్ బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేయడానికి నిరసనగా కేరళంలో వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. వారిపై

వామపక్ష సిపిఎం ప్రభుత్వం క్రూరంగా లాటీచార్జీలు జరిపించింది. అక్కడ సామాజిక కార్యకర్తలను, మేధావులను, విద్యార్థులను వెంటాడడం, కిడ్నాప్ చేయడం, ఉపా వంటి చట్టాల కింద అరెస్టు చేయడం, హత్య చేయడం నీలంబర్ సంఘటన తర్వాత పెరిగింది.

ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో సాహరన్‌పూర్ జిల్లాలో పెచ్చరిల్లిన సంఘ్‌పరివార్ దాడులకు వ్యతిరేకంగా పోరాడుతున్న భీంసేన నాయకులను చంద్రశేఖర్ ఆజాద్, రావణ్‌తో సహా ఎందరినో అరెస్టు చేసి వారిపై అక్రమ కేసులు బనాయించి జైళ్లల్లో బంధించారు. దీనికి నిరసనగా దళిత, ప్రజాస్వామిక సంఘాలు ఉద్యమిస్తున్నాయి. గూర్ఖా ప్రజలపై బలవంతంగా రుద్దిన బెంగాలీ భాషకు, బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుకు నిరసనగా జూన్ నెల నుంచి తిరిగి ఆరంభమైన ప్రత్యేక గూర్ఖాలాండ్ రాష్ట్ర ఉద్యమాన్ని అణచివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసు, పారామిలటరీ బలగాలను మోహరించాయి. అవి గూర్ఖాలపై క్రూరమైన లాటీచార్జీలు, అరెస్టులు, కర్ఫ్యూలు, కాల్పులు సాగిస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి.

## జైళ్లు 'సంస్కరణ కేంద్రాలు' కాదు – నరకకూపాలు

దేశ పౌరులు ఏ పరిస్థితుల్లో జైలు పాలయినప్పటికీ వారిని సంస్కరించి తిరిగి వారు సామాజిక జీవనాన్ని సరిగ్గా గడిపే విధంగా తీర్చిదిద్దే సంస్కరణ కేంద్రాలుగా జైళ్లు ఉండాలని భారత రాజ్యాంగం చెబుతున్నది. కానీ భారత జైళ్ల చట్టం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన మ్యానువళ్లు బ్రిటిష్ ప్రభుత్వం 1894లో రూపొందించిన జైలు మ్యానువల్‌కు కాలంచెల్లిన నకలుగానే ఉన్నాయి. జైలు సంస్కరణలకు మరో పెద్ద ప్రతిబంధకం ఐపిఎస్ అధికారులే జైలు అధికారులుగా ఉండడం. దీంతో ఆచరణలో పోలీసు అధికారుల ఇష్టారాజ్యంగా జైలు నియమాలు అమలవుతున్నాయి. ఫలితంగా దేశంలో జైలు పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయి. భారతదేశంలో జైళ్లు ప్రపంచంలోనే అత్యంత అధమమైనవిగా పరిగణించబడుతున్నాయి. జైళ్లలో అధికారులు పాల్పడే అవినీతికి, అత్యాచారాలకు అవధులు లేకుండా పోతున్నది. జైలు నిబంధనలను, ఖైదీల హక్కులను ఉల్లంఘించారంటూ తమను నిలదీసే ఖైదీలపై అధికారులు థర్డ్ డిగ్రీ చిత్రహింసలు ప్రయోగించడం సాధారణం. ఖైదీలకు బేడీలు వేయవద్దని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించి దశాబ్దాలు గడుస్తున్నా ఈ అనాగరిక పద్ధతిని అమలు చేస్తూనే ఉన్నారు. జైళ్లను ఆధునీకరించే పేరిట ఫాసిస్టు తరహాలో ఖైదీలపై అనుక్షణం నిఘా పెట్టి నియంత్రించే టెక్నాలజీని వినియోగిస్తున్నారు, అమానవీయంగా అణచివేసే పద్ధతులను ప్రవేశపెడుతున్నారు. మానవహక్కుల కమీషన్లు, పౌరహక్కుల సంస్థలు జైళ్లను సందర్శించాలంటే జైలు అధికారులకు ముందుగా తెలియజేయాల్సి ఉంటుంది. వారు వచ్చే సమయానికి జైలును శుభ్రం చేసి అంతా బాగానే ఉందనిపిస్తారు.

నిజానికి జైళ్లలో ఆహారంతో పాటు నీరు, పరిశుభ్రత, బ్యారక్కుల విషయాల్లో ఏర్పాట్లు

పశువుల శాలల కంటే కడు హీనంగా ఉంటున్నాయి. జైళ్లలో అవసరమైన కనీస వైద్య సదుపాయాలు కల్పించరు. జైలులో ఒక్క నీటి కుళాయి దెబ్బతిన్నా దాన్ని బాగు చేయడానికి 3-4 నెలలు పడుతుంది. ప్రతి వారానికి ఒకసారి జిల్లా జడ్జి, ప్రతి నెలకు ఒకసారి జిల్లా కలెక్టర్ జైళ్లను పర్యవేక్షించాలని 15 యేళ్ల క్రితమే సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశం ఎక్కడా సక్రమంగా అమలు కావడంలేదు. జైళ్ల స్థితిగతులపై 1983లో జస్టిస్ ముల్లా కమిటీ విడుదల చేసిన సిఫార్సులను ఇంత వరకూ అమలు చేయలేదు. దేశ పాలకులు కఠిన, దీర్ఘకాల శిక్షలు విధించేలా చట్టాల్ని సవరిస్తున్నారు కానీ, ఖైదీల హక్కుల పరిరక్షణకు చేసిందేమీ లేకపోగా ఉన్న హక్కులను సైతం నిరంతరం హరించి వేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న జైళ్లలో సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సౌకర్యాలను కల్పించడం కాక, నాజీ జైళ్లను తలపింపజేసేలా మరింత కట్టుదిట్టమైన భద్రతతో కూడిన నూతన జైళ్లను నిర్మించడం కోసం పెద్ద మొత్తాల్లో నిధులను కేటాయిస్తున్నారు. జైళ్లలో ఖైదీలు తమ ప్రతి ఒక్క అవసరానికీ పోరాడక తప్పని స్థితి పెరుగుతున్నది.

వైద్య సదుపాయాల లేమితో జైళ్లలో చనిపోతున్న రాజకీయ, సాధారణ ఖైదీల సంఖ్య పెరుగుతున్నది. సరైన వైద్యం అందించకపోవడం వల్ల పశ్చిమ బంగ్‌లోని పురూలియా జిల్లాలో రైతాంగ కార్యకర్త కామ్రేడ్ పరమేశ్వర్ మహతో గత 12 సంవత్సరాలుగా జీవిత ఖైదు అనుభవిస్తూ 2016 సెప్టెంబర్ 5న దండం జైలులో, అక్టోబర్ 2న కామ్రేడ్ బాబూరాం టుడు ఝార్ఖండ్‌లోని హజారీబాగ్ జైల్లో, 2017 ఫిబ్రవరి 23న ఆదివాసీ రైతు సుక్లూ మరకాం ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జైల్లో కన్నుమూశారు. ఛత్తీస్‌గఢ్‌లో జైళ్లలో వైద్య సదుపాయాలు అందించకపోవడం వల్ల ప్రతి సంవత్సరం ముగ్గురు, నలుగురు ఆదివాసీ రాజకీయ ఖైదీలు మరణిస్తున్నారు. మన ప్రియతమ నాయకులు కామ్రేడ్ సుశీల్ రాయ్‌ను కూడా ఇదే విధంగా ఫాసిస్టు ప్రభుత్వం అత్యంత క్రూరంగా హింసించింది. మన ప్రియతమ నాయకులు కామ్రేడ్ నారాయణ్ సాన్యాల్ సుదీర్ఘ జైలు జీవితంలో ప్రభుత్వం ఆయనకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయడం వల్ల ఆయన ఆరోగ్య పరిస్థితి క్రమ క్రమంగా దిగజారింది. జైలు నుంచి విడుదలైన తర్వాత ఈ సంవత్సరం ఏప్రిల్ 17న ఆయన క్యాన్సర్ వ్యాధితో అమరులయ్యారు. ఒక సర్వే ప్రకారం, ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా  శిక్షను అనుభవిస్తున్న, విచారణలో ఉన్న ఖైదీలు 1900 నుండి 2100 మంది మరణిస్తున్నారు. ఇటువంటివన్నీ పాలకవర్గాలు కొనసాగిస్తున్న హత్యలే.

మహిళలు జైళ్లలో తరచుగా తీవ్రమైన అనారోగ్యాలకు గురి అవుతున్నారు. మహిళా రాజకీయ ఖైదీలు మరిన్ని సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. వారిని బ్రాహ్మణవాద భూస్వామ్య పితృస్వామ్యం అడుగడుగున వెంటాడి అణచివేతకు గురిచేస్తున్నది. ఎన్నో జైళ్లలో జైలు అధికారులు బ్యారక్‌లను తనిఖీ చేసేందుకు వచ్చినప్పుడు ఖైదీలు చెప్పులు తీసి మొక్కాలి. మహిళలు పవిట కొంగు తలపైన కప్పుకోవాలి. లేకపోతే వారిని తీవ్రంగా దుర్భాషలాడుతారు. ఆరోగ్య రీత్యా పురుషులతో

పోల్చితే మహిళలకు పౌష్టికాహారం అధికంగా ఇవ్వాల్సిన అవసరం ఉండగా, తక్కువ ఆహారమే ఇస్తారు. మహిళలకు అవసరమైన కొన్ని ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో వుండవు. వీటితో మహిళలు దుర్భరమైన పరిస్థితుల్లోకి నెట్టివేయబడుతున్నారు. పారు అర్జున్ పటేల్ అనే ఆదివాసీ రాజకీయ కార్యకర్తను తీవ్రమైన అనారోగ్య పరిస్థితులలో ముంబయిలో చికిత్స పొందుతుండగా పోలీసులు 2012 మార్చిలో అరెస్టు చేశారు. అనేక తప్పుడు కేసులు బనాయించి వివిధ జైళ్లలో బంధించారు. కానీ గత ఐదు సంవత్సరాలుగా ఆమె కంటిచూపు, వినికిడి సమస్యలకు ఎటువంటి చికిత్స లభించలేదు. ప్రస్తుతం ఆమె దాదాపు పూర్తిగా చెవుడు, గుడ్డితనంతో మృత్యువుకు దగ్గరవుతోంది. జైళ్లల్లో మహిళలపై లైంగిక అత్యాచారాలు సర్వసాధారణంగా మారిపోయాయి. ఇలాంటి అత్యాచారాలకు పాల్పడే వారిలో ఎక్కువ మంది జైలు సిబ్బంది, వారికి తొత్తులుగా ఉండే పురుష ఖైదీలు (వార్డెన్‌లు) కావడం వల్ల బాధితురాళ్లు వాటిపై ఫిర్యాదు చేసినా జైలు అధికారులు రోజులు, వారాల తరబడి నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆ తర్వాత కేసు నమోదు చేసి, వైద్య పరీక్షలు చేసినా ఫలితం మాత్రం శూన్యంగానే ఉంటుంది. మెడికల్ పరీక్షకు రెండు వారాలు, చార్జిషీటు దాఖలు చేయడానికి సుమారు రెండు సంవత్సరాలు, ఆరోపణలకు తుదిమెరుగులు దిద్దడానికి మరో రెండు సంవత్సరాలు పడుతుంది. బాధితురాళ్లు ప్రైవేటు లాయర్లను పెట్టుకోలేరు. లీగల్ ఎయిడ్ పానెల్ లాయర్లు జైళ్లలో మహిళలపై జరిగే లైంగిక అత్యాచారాలు, చిత్రహింసలపై కేసులను పట్టించుకోరు. చాలా మంది బాధితురాళ్లకు తమ కేసు ఎక్కడి వరకూ వచ్చిందీ, తమ లాయర్ ఎవరు అనే విషయం కూడా తెలియదు.

సంవత్సరాలు గడిచినా బెయిల్స్ ఇవ్వడం లేదు. ఎస్కార్ట్ లేదనే పేరుతో ఖైదీలను కోర్టు కేసులకు తీసుకెళ్లడం లేదు. కోర్టుల్లో కుప్పలు పడుతున్న కేసులకు తోడు, జడ్జీల, పోలీసుల అణచివేత విధానాల వల్ల మామూలు కేసుల్లో సైతం బెయిల్ దొరకక సంవత్సరాల తరబడి జైళ్లలో మగ్గిపోవాల్సి వస్తున్నది. బెయిల్ పిటిషన్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ దాన్ని పట్టించుకునేవాళ్లు లేరు. ఇది పూర్తిగా రాజ్యాంగానికి వ్యతిరేకం. రాజ్యాంగంలోని 19, 20, 21 ఆర్టికిల్స్ ప్రకారం జీవించే హక్కును, త్వరగా కేసులను నడిపించే హక్కును ఉల్లఘించడమే.

నేడు దేశవ్యాప్తంగా జైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. దేశంలో ఉన్న జైళ్లు సరిపోకపోవడంతో నూతనంగా అనేక మెగా జైళ్లను, ఓపెన్ ఎయిర్ జైళ్లను నిర్మాణం చేయడమే గాక, కొన్ని సందర్భాల్లో తాత్కాలిక గుడారాలను కూడ వాడుతున్నారు. దేశంలో జైళ్లలో అత్యధిక ఖైదీలు పేద దళితులు, ఆదివాసులు. పేదరికం, నిరాక్షరాస్యత, వారికి తగిన లీగల్ సహాయం అందకపోవడం వల్ల దేశంలో గత ఐదు సంవత్సరాలో అండర్‌ట్రయిల్ ఖైదీల సంఖ్య వేగంగా పెరిగిపోయింది. జైళ్లలో వున్న 10 మందిలో 7 గురు అండర్‌ట్రయిల్సే. వీరిలో 43 శాతం

మంది 6 నెలల నుంచి 5 సంవత్సరాల వరకూ జైళ్లలో బంధించబడి ఉంటున్నారు. వీరిలో అనేక మందిపై ఉన్న కేసులకు శిక్షలు విధించినా ఇంతకాలం జైల్లో మగ్గాల్సిన దుస్థితి ఏర్పడదు.

దేశంలోని జైళ్లు ప్రత్యేకించి, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, కర్నాటక, కేరళం, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, అసోం, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో వాటి సామర్థ్యానికి మించి, రెండు, మూడు నుంచి నాలుగు రెట్ల వరకు ఖైదీలతో కిక్కిరిసిపోతున్నాయి. అక్కడ పడుకోవడానికి, కనీసం కూర్చోవడానికి కూడా చోటు ఉండడం లేదు. ఉదాహరణకు, ఛత్తీస్‌గఢ్‌లో జైళ్ల సామర్థ్యం 6,070 కాగా, ప్రస్తుతం వాటిలో 16,000 కంటే అధికంగా ఖైదీలు బంధించబడి ఉన్నారు. ఖైదీల సంఖ్యను తగ్గించడానికి బీహార్‌లో స్మిత చక్రవర్తి కమీషన్ నివేదికలో – ఖైదీలకు వ్యక్తిగత పూచీకత్తు ద్వారా బెయిల్ ఇవ్వడం, వారి కేసులపై బెయిల్ పిటిషన్లను, కేసులను త్వరగా విచారించి బెయిల్ మంజూరు/విడుదల చేయడం, తప్పుడు కేసులను కొట్టివేయడం మొదలైన అనేక సూచనలు చేసింది. 2016 అక్టోబర్‌లో సుప్రీంకోర్టు దేశంలోని జైళ్లలో ఖైదీల సంఖ్యను తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించినప్పటికీ ప్రభుత్వాలు ఎటువంటి సమర్థవంతమైన చర్యలు చేపట్టలేదని తప్పుబట్టింది. నిజానికి రాజ్యాంగంలో ఆర్టికల్ 19 (1) (జి) ప్రకారం ప్రాథమిక హక్కులతో సహా, తమపై నమోదైన కేసులను పారదర్శకంగా విచారణ జరపమని కోరే హక్కు, ఆర్టికల్ 22, సిఆర్‌పిసి సెక్షన్ 303ల ప్రకారం తమకు ఇష్టమైన లాయర్‌ను నియమించుకునే హక్కు, ఆర్టికల్ 39 (ఏ) ఆదేశిక సూత్రం ప్రకారం సమాన న్యాయం, ఉచిత లీగల్ సహాయం కల్పించాలి. వీటిని జైలు, న్యాయ వ్యవస్థలు ఉల్లంఘిస్తున్నాయి. కేసులు చేపట్టిన లాయర్లను ఖైదీలు కలిసి మాట్లాడే యంత్రాంగమే ఉనికిలో లేదు. లాయర్ తన ముద్దాయితో 15 నిముషాల కంటే ఎక్కువసేపు మాట్లాడలేడు. రాజకీయ ఖైదీల కేసులు చేపట్టిన లాయర్లను పోలీసులు బెదిరిస్తున్నారు. ఉల్టా వారిపైనే కేసులు పెట్టి జైళ్లలో బంధించడం పెద్దెత్తున కొనసాగుతున్నది. ప్రజాస్వామ్యం ముసుగులో దాగి ఉన్న ఫాసిస్టు ప్రభుత్వం, దేశ పౌరులను జైళ్లల్లో బంధించి వారికి న్యాయం అందజేస్తున్న ప్రజాస్వామిక విధానం ఇది!

జైలు అధికారులు కల్పించే 'జాలీ'(అడ్డుతెర) ములాఖతుల్లో, పోలీసుల, ఇంటెలిజెన్స్ ఏజెన్సీల సమక్షంలో జరిగే ములాఖత్‌ల మూలంగా ఖైదీలు తమ నేరారోపణ గురించి కనీసం తమ వకీళ్లతోనైనా వాస్తవాలు వెల్లడించుకునే అవకాశం లేకుండా పోయింది. ములాఖత్‌లలో కూడ ఎన్నో అడ్డగోలు వ్యవహారాలు, నిషేధాలు ఉంటున్నాయి. పేదరికం, పోలీసు నిర్బంధం వలన ఖైదీల బంధువులు ములాఖత్‌లకు రావడానికే చాల యిబ్బందులు ఎదుర్కొంటున్నారు. యిలాంటి స్థితిలో ఖైదీలు తమ కుటుంబాల యోగ క్షేమాలు తెలియక అనేక విధాల మానసిక యిబ్బందులకు గురి అవుతున్నారు. అక్రమంగా కేసుల్లో యిరికి జైళ్ల పాలైన వారి యిండ్లలో ఆలనా పాలనా లేక ఎన్నో కుటుంబాలు దీనావస్థలో ఉన్నాయి.

## రాజకీయ ఖైదీలపై కొనసాగుతున్న తీవ్రమైన అణచివేత

సంఘ్‌పరివార్ సాగిస్తున్న దాడులకు వ్యతిరేకంగా, సమాజ ప్రయోజనం కోసం పీడిత వర్గాల, సెక్షన్ల, జాతుల, మత మైనారిటీల ప్రయోజనాల కోసం, వివిధ రాజకీయ విశ్వాసాలతో కృషిసల్పే వ్యక్తులను, మావోయిస్టులను, విప్లవ సానుభూతిపరులను, వివిధ ప్రజాస్వామిక, జాతివిముక్తి ఉద్యమాల నాయకులు, కార్యకర్తలు, జైళ్లలో సాధారణ నేరస్తులుగానే పరిగణిస్తున్నారు. వారికి రాజకీయ ఖైదీల హోదాను కల్పించాలని వివిధ కోర్టులు తీర్పులు చెప్పినా పాలకవర్గాలు వాటిని అమలు చేయడం లేదు.

రాజకీయ ఖైదీలపై ఎన్ని కేసులు ఉన్నాయనే విషయాన్ని కూడా రహస్యంగా ఉంచుతున్నారు. 5-10 ఏండ్లు జైళ్లలో మగ్గుతున్న వారిపై కొత్త కొత్త వారంట్లు జారీ చేస్తూనే ఉన్నారు. నిజానికి ఖైదీలు తమపై ఎన్ని కేసులు ఉన్నాయో తెలుసుకునే హక్కు ఒక ప్రాథమిక హక్కు అని భారత రాజ్యాంగం ఆర్టికల్ 22 (1) చెబుతున్నది. దీన్ని తుంగలో తొక్కుతున్న జైలు అధికారులు పోలీసులతో కుమ్మక్కై చాలా మంది రాజకీయ ఖైదీలు విడుదలైనా జైలు వద్దనే తిరిగి వారిని అరెస్టు చేయించి కొత్తగా తప్పుడు కేసులతో జైళ్లలో బంధిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో సత్యంరెడ్డి, పద్మలను బెయిల్ వచ్చి విడుదలయినా జైలు గేటు వద్దనే తిరిగి అరెస్టు చేసి కొత్త కేసుల కింద జైల్లో బంధించారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, ఝార్ఖండ్, బీహార్, ఒడిశా, పశ్చిమ బంగ్, ఉత్తరప్రదేశ్, హర్యానాలలో ఇలా పదే పదే జరుగుతోంది. తద్వారా చాలా మందిని ఎన్నటికీ విడుదల కాకుండా అడ్డుకుంటున్నారు.

మత మైనారిటీల వారి విషయంలో ఎటువంటి నిర్దిష్ట ఆరోపణలు లేకుండానే సంవత్సరాల తరబడి జైళ్లలో బంధిస్తున్నారు. ఢిల్లీ, గాజియాబాద్, రోహతక్‌లలో బాంబుపేలుడు కేసుల్లో మాస్టర్ మైండ్‌గా ఆరోపిస్తూ మొహమ్మద్ ఆమిర్‌ఖాన్‌ను 14 సంవత్సరాలు బంధించి, చివరకు పోలీసులు ఎటువంటి సాక్ష్యం చూపించలేక పోవడంతో కోర్టు విడిచిపెట్టాల్సి వచ్చింది. ఇలాంటి కేసులు అసంఖ్యాకం.

రాజకీయ ఖైదీలపై ఉన్న కేసులపై విచారణ (ట్రయిల్స్) కుట్రపూరితంగా జాప్యం చేస్తూ సరిగా నడిపించడం లేదు లేదా నత్తనడక నడిపిస్తున్నారు. అనేక సంవత్సరాల ట్రయిల్స్ నడిచిన తర్వాత సరైన సాక్ష్యాలు లేవంటూ జైళ్ల నుంచి విడుదల చేయక తప్పనిస్థితి ఏర్పడుతున్నది. ఇలా 6, 7, 8 సంవత్సరాల పాటు పశ్చిమ బంగ్ జైళ్లలో మగ్గిన కామ్రేడ్స్ గౌరు చక్రవర్తి, హిమాద్రి సేన్ రాయ్, చాంది సర్కార్ తదితర రాజకీయ ఖైదీలు జులై 2016లో విడుదలయ్యారు. (పశ్చిమ బంగ్ రాష్ట్ర కమిటీ మాజీ కార్యదర్శి కా.హిమాద్రి విడుదల అనంతరం కొద్ది కాలానికే కన్నుమూశారు). మహారాష్ట్రలో బైకుల్లా జైలు నుంచి కామ్రేడ్ ఏంజెలా సొంటక్కెకు 6 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంతో విడుదలైంది.

రాజకీయ విశ్వాసాలు ఉన్నందుకు విప్లవకారులను సాధారణ ఖైదీల నుంచి వేరుచేసి ఒంటరి సెల్స్‌లో బంధిస్తున్నారు. రాజకీయ ఖైదీలలో కామ్రేడ్స్ అఖిలేష్ యాదవ్, ప్రమోద్ మిశ్రా, మురళీధరన్, కోబాడ్ గాంధీ, సాధానాల రామకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, అమితాబ్ బాగ్చీ వంటి సీనియర్ సిటిజన్స్ కోవకు చెందిన నాయకులను వారి వయసు, ఆరోగ్యంతో సంబంధం లేకుండా సుదీర్ఘకాలంగా జైళ్లల్లో బంధించి ఉంచుతున్నారు. దీర్ఘకాలంగా వారు ఎదుర్కొంటున్న ప్రాణాంతక వ్యాధులకు సకాలంలో సరైన చికిత్స, మందులు అందకుండా చేస్తూ వారి పట్ల జైలు అధికారులు చాలా అమానవీయంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నది.

మన పార్టీ కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్స్ విజయ్ కుమార్ ఆర్య, వారణాసి సుబ్రమణ్యం, మోహిత్, పతిత్ పావన్ హల్దార్, రాష్ట్ర కమిటీ సభ్యులు బీహార్-ఝార్ఖండ్ రాష్ట్రాలలో కామ్రేడ్స్ కుణాల్, పిఎన్, సతీష్, చంద్రప్రకాశ్, సునీల్, తరుణ్, పశ్చిమ బెంగాల్‌లో కామ్రేడ్స్ సుదీప్ చోంగ్‌దార్, అఖిల్, విద్యుత్, అను, అశోక్, అసోంలో కామ్రేడ్ ఇంద్రనీల్, మహారాష్ట్రలో కామ్రేడ్ మదన్‌లాల్, తెలంగాణలో కామ్రేడ్ శివారెడ్డి, తమిళనాడు, కర్నాటక, కేరళంలలో కామ్రేడ్ షైనాతో పాటు మరో ఏడుగురు, ఈ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలలో వివిధ స్థాయిలకు చెందిన అనేక మంది కామ్రేడ్స్ అనేక కేసుల్లో ఇరికించబడి చాలా సంవత్సరాల నుండి జైళ్లలో అనేక సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకించి మహిళా కామ్రేడ్స్ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తప్పుడు సాక్ష్యాలతో లేదా ఎటువంటి సాక్ష్యాలు లేకుండా గత సంవత్సర కాలంలో అనేక మంది రైతులకు, విప్లవకారులకు ఉరిశిక్షలు, జీవిత ఖైదు, 5-10 ఏండ్ల శిక్షలు విధించారు. గత ఏప్రిల్‌లో ఝార్ఖండ్‌లో లోహర్‌దగా కోర్టు సెన్హా ఆంబుష్ ఆరోపణలో ఐదుగురు మావోయిస్టు విప్లవకారులకు, ఆగస్టులో ప్రవల్ దాకు దుమ్కా కోర్టు కఠిన జీవిత ఖైదు విధించాయి. బీహార్‌లో సినారీ కేసులో నవంబర్‌లో జహానాబాద్ జిల్లా కోర్టు 10 మంది కామ్రేడ్స్‌కు ఉరిశిక్ష, ముగ్గురికి జీవిత ఖైదు విధించింది. 2016 చివర్లో బీహార్‌లోని బారా కేసులో నలుగురు మావోయిస్టు ఖైదీలకు ఉరిశిక్ష పడి గత 24 సంవత్సరాలుగా తన వద్ద పెండింగ్‌లో ఉన్న క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ఆమోదిస్తూ "బతికి ఉన్నంత వరకూ" జైలులోనే ఉండాలని ఆదేశాలు జారీ చేశాడు. ప్రజాస్వామికవాదులంతా దీన్ని తీవ్రంగా ఖండించారు. 2017 మే నెలలో బీహార్‌లోని ముంగేర్ జిల్లా కోర్టు ఒక ఆంబుష్ ఆరోపణలో 5 గురు మావోయిస్టు ఖైదీలకు ఉరిశిక్ష విధించింది. కాంకేర్ (ఛత్తీస్‌గఢ్) జిల్లా కోర్టు సోకాల్డ్ 'అర్బన్ నెట్‌వర్క్' కేసులో 5 గురు రైతులు, చిన్న వర్తకులకు 10 యేళ్ల జైలు శిక్ష విధించింది.

ఉపా కేసు కింద నాగపూర్ జైల్లో నిర్బంధించబడిన ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్, 90 శాతం వికలాంగుడు అయిన డాక్టర్ జిఎన్ సాయిబాబాను బేషరతుగా విడుదల చేయాలని

దేశ, విదేశాల్లో జరిగిన సుదీర్ఘ పోరాటం తర్వాత 2016 ఏప్రిల్‌లో బెయిల్ లభించింది. ఇది ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తుల విజయం. అయితే ఒక సంవత్సరం గడవకుండానే మరే కేసు కంటే భిన్నంగా ఆయన కేసు విచారణ వేగంగా నడిపి, 2017 మార్చి 7న ఆయనతో సహా, మరో ఐదుగురికి మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సెషన్స్ కోర్టు సరైన సాక్ష్యాలు లేకుండా జీవిత ఖైదు శిక్ష విధించింది. దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న సాయిబాబాకు కనీసం కోర్టు అనుమతించిన వైద్యాన్ని కూడా అందకుండా ఆయనను జైలులోనే హత్య చేయాలని పాలకవర్గాలు చూస్తున్నాయి. ఈ తీర్పుకి వ్యతిరేకంగా దేశ, విదేశాల్లో పెద్దెత్తున నిరసన పెల్లుబికింది. ఇందుకు భిన్నంగా ఫాసిస్టు హిందూ సంఘ్ పరివార్‌కు చెందిన కొన్ని రాజ్య ప్రాయోజిత విప్లవ ప్రతీఘాతుక సంఘాలు సాయిబాబా తదితరులకు "ఉరిశిక్ష వేయాలి" అంటూ నాగపూర్‌లో ప్రదర్శన నిర్వహించారు.

బారా, సినారీ, ముంగేర్ లాంటి కేసుల్లో భూమిలేని, నిరుపేద దళితులు, వెనుకబడిన కులాల వారే ఇలాంటి కఠిన శిక్షలకు గురవడాన్నీ, అదే అగ్రకులాల వారిపై ఉండే ఇలాంటి కేసులను చాలా సులభంగా కొట్టివేయబడడాన్నీ బట్టి ఈ న్యాయ వ్యవస్థ వర్గ స్వభావం స్పష్టమవుతున్నది. నిజానికి పైన పేర్కొన్న బారా కేసులో సాక్ష్యాలు లేకపోయినా శిక్షలు వేశారు. 1980, 1990లలో అగ్రవర్ణ భూస్వాముల రణవీర్ సేన 23 సంఘటనల్లో 256 మంది పేద, దళితుల్ని ఊచకోత కోసింది. అయినప్పటికీ బథానీ టోలా, లక్షణపూర్-బాథే, నగరి బజార్, మెయిన్‌పూర్, నారాయణ్‌పూర్, శంకర్ బిఘా హత్యాకాండలలో రణవీర్ సేన, తదితర సేనలకు చెందిన హంతకులపై విచారణ జరిపి వారిని నిర్దోషులుగా వివిధ కోర్టులు విడుదల చేశాయి. నగరి బజార్ కేసులో ఒక్కరికి మాత్రమే జీవిత ఖైదు పడింది.

ఇదే విధంగా ఒడిశాలో కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ ఆశుతోష్, ఝార్ఖండ్‌లో కామ్రేడ్స్ సుఖేందు ముండా, శోభా ముండా, మహేశ్వర్ మహతో, అనిల్ మండల్, రంజన్, ఛత్తీస్‌గఢ్‌లో కామ్రేడ్ మధు జీవిత ఖైదును; మధ్యప్రదేశ్‌లో కామ్రేడ్స్ సునీత, రవీందర్, డాంగే, రాంచందర్, నారన్న ఇతర శిక్షలను ఎదుర్కొంటున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కామ్రేడ్స్ నిర్మల, పద్మ వంటి రాజకీయ ఖైదీలు తీవ్ర అనారోగ్యంతో సుదీర్ఘకాలంగా జైళ్లలో మగ్గుతున్నారు. నిర్మల, పద్మలు 2007 నుంచి అండర్ ట్రయిల్ ఖైదీలుగా ఉంటున్నారు. హైదరాబాద్ చర్లపల్లి జైలులో ఉన్న కామ్రేడ్ మాలతికి రెండు కేసులలో విధించిన శిక్షాకాలాన్ని ఏకకాలంలో అనుభవించనీయకుండా పోలీసు అధికారులు కోర్టులు కుమ్మక్కై నిరంకుశంగా ఆమె విడుదలను అడ్డుకొని యేళ్లతరబడిగా ఆమె జైల్లో మగ్గేలా చేస్తున్నారు.

భారత దోపిడీ పాలకవర్గాలు తమకు వ్యతిరేకంగా పోరాడేవారికి ఒక హెచ్చరిక చేసేందుకూ, విప్లవ, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తుల పోరాటచేవను నీరుగార్చేందుకు కోర్టులు వుద్దేశ్యపూర్వకంగా కఠిన శిక్షలు విధిస్తున్నాయి. ఇందుకు భిన్నంగా గత 50 సంవత్సరాల

కాలంలో వేలాది మంది విప్లవకారుల శీర్ష నాయకత్వాన్ని, క్యాడర్లను, సాధారణ ప్రజలను ఊచకోత కోసిన ఏ ఒక్క పోలీసు/జైలు అధికారికీ ఏ కోర్టు శిక్షలు వేయలేదు. 1984 సిక్కుల ఊచకోత, 2002 గుజరాత్ ఊచకోత తదితరమైన వాటికి బాధ్యులైన ఏ ఒక్క కాంగ్రెస్, బిజెపి నాయకునికీ ఏ ఒక్క కోర్టూ శిక్షలు వేయలేదు. పలు అవినీతి కుంభకోణాల్లో లక్షల కోట్ల రూపాయల ప్రజాధానాన్ని దోచుకున్న పాలకవర్గ పార్టీల నాయకులకు, వారి దళారీలకు శిక్షలు పడింది లేదు. కోర్టుల ఈ బూర్జువా, భూస్వామ్య అనుకూల వైఖరిని ప్రజల్లో బహిర్గతం చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

హిందూ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగానూ, కశ్మీర్ జాతి విముక్తి పోరాటంలోనూ పెరుగుతున్న ముస్లిం యువత భాగస్వామ్యాన్ని అడ్డుకునే కుట్రలలో భాగంగా మధ్యప్రదేశ్ హిందూ ఫాసిస్టు బిజెపి ప్రభుత్వం వెనుక నుండి పథకం ప్రకారం 2016 అక్టోబర్ 31న భోపాల్ సెంట్రల్ జైలులో 8 మంది అండర్‌ట్రయిల్ సిమి కార్యకర్తలను అత్యంత దుర్మార్గంగా హత్య చేయించింది. సిమి కార్యకర్తలు 30 అడుగుల జైలు గోడను దూకడం, వాచ్ టవర్లు, సెక్యూరిటీ కెమెరాల నిఘాకు అందకుండా జైలు నుండి పారిపోవడం, పోలీసుల 'ఎన్‌కౌంటర్'లో నగర శివార్లలో వారు మరణించడం అంతా పచ్చి అబద్ధం.

రాజకీయ ఖైదీలకు ఓపెన్ యూనివర్సిటీలో చేరి తమకు నచ్చిన విద్యను అభ్యసించకుండా జైలు అధికారులు నిరంకుశంగా అడ్డుపడుతున్నారు. రాజకీయ ఖైదీలను పదే పదే ఒక జైలు నుండి మరో జైలుకు మార్చుతూ వేదిస్తున్నారు. కామ్రేడ్ కోబాడ్ గాంధీ దీనికి నిరసనగా గత జులైలో నిరాహార దీక్ష చేపట్టగా దీక్షలో ఉన్నప్పుడే ఆయనను బలవంతంగా మరో జైలుకు తరలించారు.

## జైలు కటకటాల వెనుక పోరాటాలు

జైళ్లలో దోపిడీ పాలకవర్గాల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా రాజకీయ ఖైదీలు పోరాడే విప్లవకర సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. శత్రువు చిత్రహింసలు పెట్టినా, ఒంటరి సెల్స్‌లో బంధించినా, లొంగుబాటు ఎత్తుగడలు పన్నినా, విప్లవ చైతన్యంతో, వర్గకసితో తిప్పికొడుతున్నారు. పార్టీ రహస్యాలను కాపాడుతూ పార్టీ ప్రతిష్టను ఎత్తిపడుతున్నారు. విప్లవ విజయం పట్ల, పార్టీ, ప్రజల పట్ల పూర్తి విశ్వాసాన్ని ప్రదర్శిస్తున్నారు. జైలు కమ్యూన్లలో సంఘటితమవుతున్నారు. జైలు అధికారులు అమలు చేస్తున్న అణచివేత చర్యలను సాధారణ ఖైదీలతో కలిసి సమైక్యంగానూ, ఒంటరిగానూ ప్రతిఘటిస్తున్నారు. ప్రత్యేకించి మన కామ్రేడ్స్ ఈ పోరాటాలలో ముందుపీఠిన నిలబడుతూ జైళ్లను పోరాట కేంద్రాలుగా మార్చుతున్నారు. కొన్ని హక్కులు సాధించుకుంటున్నారు. జైళ్ల లోపల మన కామ్రేడ్స్ నిర్వహించే పోరాటాలు

భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో విడదీయరాని భాగంగా ఉంటూ ఒక ప్రముఖ స్థానాన్ని కలిగి ఉన్నాయి.

రెండేళ్లకు పైగా పూణే (మహారాష్ట్ర) జైలులో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వయోవృద్ధ మావోయిస్టు రాజకీయ ఖైదీ కామ్రేడ్ మురళీధరన్‌ను కోర్టుకు వాయిదాలకు తీసుకెళ్లకుండా వేదిస్తున్నారు. దీనికి నిరసనగా అనారోగ్య కారణాల రీత్యా ఆయనను బెయిల్‌పై విడుదల చేయాలనీ, తక్షణం తగిన వైద్య సేవలు అందించాలనీ డిమాండ్ చేస్తూ ఒక అంతర్జాతీయ క్యాంపెయిన్‌ను వివిధ ప్రజాస్వామిక, పౌరహక్కుల సంస్థలు, ప్రముఖ మేధావులు నిర్వహించారు. దీని ప్రభావంతో జైలు అధికారులు దిగి వచ్చి ఆయనను పూణె ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. భారత ప్రజాయుద్ధానికి మద్దతుగా ఏర్పడిన అంతర్జాతీయ కమిటీ (ఐసిఎస్‌పిడబ్ల్యుఐ) దేశంలోని రాజకీయ ఖైదీల హక్కులకు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో ఒక అంతర్జాతీయ వారాన్ని పాటించింది.

ఒడిశాలో ఝూర్‌పాడ స్పెషల్ జైలులో గత మార్చి-ఏప్రిల్ నెలల్లో 7 గురు మావోయిస్టు ఖైదీలు కేసులను త్వరగా విచారించాలనీ, తమను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలనీ తదితర ఐదు డిమాండ్లపై 21 రోజుల పాటు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఒడిశా మానవహక్కుల కమీషన్ నిర్దిష్టంగా ఆదేశం జారీ చేసిన తర్వాతనే దీక్ష విరమించారు. అలాగే మల్కన్‌గిరి జైలు, భంజానగర్ (గంజాం) జైలులోని అండర్‌ట్రయిల్ మావోయిస్టు ఖైదీలు కూడా ఇదే కాలంలో దీక్షలు చేపట్టారు. ఝార్ఖండ్‌లో నారి ముక్తి సంఘ్‌లో 16 సంవత్సరాలుగా పనిచేస్తూ పోలీసులచే అక్రమంగా అరెస్టు చేయబడిన ఆ సంఘ కార్యదర్శి కామ్రేడ్ చాంద్‌ముని హంస్‌దా విడుదల కోసం మహిళా కార్యకర్తలు ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తున్నారు. మారుతి సుజుకి బహుళజాతి కంపెనీకి చెందిన 36 మంది కార్మిక నాయకులు, కార్మికుల విడుదలకై గుడ్‌గాం పారిశ్రామిక ప్రాంతంలో వివిధ కంపెనీల్లో కార్మికులు నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. వారి కుటుంబాలను ఆర్థికంగా, హార్దికంగా ఆదుకుంటున్నారు.

సాధారణ ఖైదీలు కూడా అనేక పోరాటాలు నిర్వహించారు. రాయపూర్ (ఛత్తీస్‌గఢ్) సెంట్రల్ జైలులో ఖైదీల హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గత అక్టోబర్‌లో 2 వేల మంది ఖైదీలు పోరాడడం, ఇందుకు వారు సోషల్ మీడియాను ఉపయోగించుకోవడం జైలు అధికార్లను కలవరపరిచింది. దీన్ని అణచడం కోసం అదనంగా 300 మంది పోలీసులను మోహరించారు. ఈ పోరాటంలో ఖైదీలు 10 డిమాండ్లు సాధించుకున్నప్పటికీ ఇందుకు నాయకత్వం వహించిన వీరేంద్ర కుర్రేను అధికారులు నిరంకుశంగా మరో జైలుకు తరలించారు. గత నవంబర్‌లో జగదల్‌పూర్ (ఛత్తీస్‌గఢ్) సెంట్రల్ జైలులోని ఖైదీలు కూడా ఇదే విధంగా తమ డిమాండ్లపై ఆందోళన చేపట్టగా జైలు అధికారులు వారిని జైలు మైదానంలో బంధించి జైలులోకి సిఆర్‌పిఎఫ్

బలగాలను రప్పించి ఆ రోజంతా క్రూరంగా లాటీచార్జి చేయించారు. అనేక ఖైదీలను అక్కడి నుంచి జాడ తెలియని చోటికి తరలించారు. జైలులో దుర్భరమైన స్థితిని, జైలు అధికారుల అమానవీయ యాతనలను సహించలేక ఖైదీలు అనేక సార్లు సమ్మెలు చేశారు. ఈ సంవత్సరం ముంబయిలో బైకుల్లా సెంట్రల్ జైలులో ఆహారంలో కుళ్లిపోయిన కోడిగుడ్డును ఇచ్చినందుకు నిలదీశాడన్న కోపంతో మంజు సేఠ్ అనే సాధారణ ఖైదీని జైలు అధికారులు, సిబ్బంది విపరీతంగా కొట్టడంతో అతను మరణించాడు. దీనికి నిరసనగా జైలులోనూ, బయటా పోరాటాలు జరిగాయి.

రాజకీయ ఖైదీల హక్కుల కోసం, మద్దత్తు కోసం, వారి విడుదల కోసం సంబంధిత సంఘాలతో పాటు పౌరహక్కుల సంఘాలు పలు ఉద్యమాలు, ర్యాలీలు, సదస్సులు నిర్వహించాయి. మన పార్టీ రాజకీయ ఖైదీల పోరాటాలకు మద్దతుగా వివిధ రూపాల్లో ప్రజల్ని కదిలిస్తున్నది, వారి విడుదలకు కృషి చేస్తున్నది. ఈ కృషిని మరింత తీవ్రతరం చేయాలి. శత్రు నిర్బంధ శిబిరాలలో సాధారణ ఖైదీలతో సహా రాజకీయ ఖైదీలు చేస్తున్న పోరాటాలకు అండగా మన పార్టీ, ప్రజాస్వామిక సంస్థలు నిలబడాలి. ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దశలో భాగంగా ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ 2017 పేరుతో తమ ఫాసిస్టు దాడిని మరింత తీవ్రతరం చేస్తూ దేశవ్యాప్తంగా తెల్లబీభత్సం సృష్టిస్తూ వందలాది మందిని అరెస్టు చేసి జైళ్లల్లో కుక్కుతున్నాయి. జైళ్లల్లో రాజకీయ ఖైదీలపై దాడి మరింత క్రూరంగా మారుతున్నది. ఈ ఫాసిస్టు దాడికి వ్యతిరేకంగా, రాజకీయ ఖైదీల హక్కుల కోసం ఆందోళనలను తీవ్రతరం చేయాలి. బలమైన ప్రజాస్వామిక ఉద్యమాలను నిర్మించడం వలన మునుపటి టాడా, పోటా వంటి క్రూరమైన చట్టాలును ప్రభుత్వాలు రద్దు చేయాల్సిన స్థితి ఏర్పడింది. అదే విధంగా ఉపా, అఫ్‌స్పా వంటి నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి. రాజకీయ ఖైదీలపై సాగుతున్న అణచివేత, పీడనలను బయటి ప్రపంచానికి చాటిచెప్పాలి. జైలు పోరాటాలతో బయట సాగుతున్న పోరాటాల్ని సమన్వయించాలి. ఇందులో మనం చేయవలసినంత చేయలేకపోతున్నాం. వారి సమస్యలను, వారి కుటుంబాల సమస్యలను సరిగ్గా పట్టించుకోలేకపోతున్నాం. ఈ బలహీనతను అన్ని స్థాయిల కమిటీలు తొలగించుకోవాలి.

**కామ్రేడ్స్!**

2010 సి.సి. సమావేశం రాజకీయ బందీల విడుదల పోరాట దినాలుగా, సంఘీభావ దినాలుగా జైళ్లలోనూ, జైళ్ల బయటా ప్రతి సంవత్సరం మార్చి 23, సెప్టెంబర్ 13, డిసెంబర్ 10 (ప్రపంచ మానవహక్కుల దినం) తేదీలను పాటించాలని ప్రకటించింది. అప్పటి నుండి మన పార్టీకి చెందిన రీజనల్ బ్యూరోలు (ఆర్.బి.), రాష్ట్ర కమిటీలు ఈ రోజుల్లో తీసుకోవాల్సిన నిర్దిష్ట కార్యక్రమాన్ని ప్రకటిస్తూ పిలుపునిస్తున్నాయి. జైళ్లలోనూ కామ్రేడ్స్ ఈ దినాలను పాటిస్తున్నారు. వివిధ రాష్ట్రాల/ప్రాంతాల జైళ్లలోనూ, బయటా పరిస్థితుల్లో, అవకాశాల్లో తేడాలుండడం వల్ల

అంతటా ఒకేసారి ప్రచార–ఆందోళనా కార్యక్రమాలు జరగడం లేదు. ఉద్యమ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పార్టీ అఖిల భారత స్థాయిలో పలుసార్లు ఇలాంటి కార్యక్రమాలు తీసుకుంటుండడం వల్ల కొన్ని సార్లు రాజకీయ బందీల విడుదల కోసం సంఘీభావ దినాలు ప్రభావశీలంగా జరగడం లేదు. అందువల్ల 2013 నుండి ఇంతవరకు జరిపినట్లుగానే సెప్టెంబర్ 13, డిసెంబర్ 10 తేదీలను రాజకీయ బందీల విడుదల కోసం సంఘీభావ–పోరాట దినాలుగా జరపాలని పార్టీ యూనిట్లన్నింటినీ కేంద్రకమిటీ కోరుతున్నది.

ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల జైళ్లలో గల మన రాజకీయ బందీల సంఖ్య, జైళ్ల పేర్లు, మోపబడిన కేసుల సంఖ్య, ఎన్ని సంవత్సరాలుగా జైళ్లలో బంధించబడినారు, శిక్షపడిన వారి వివరాలు, వారిలో మహిళలు–పిల్లలు–వృద్ధులు, రైతులు, ఆదివాసులు, దళితులు, కార్మికులు, విద్యార్థులు ఎందరు ఉన్నారు, వకీళ్లను పెట్టుకోలేని వారు ఎందరు–ఎవరెవరు, జైళ్ల వద్ద న్యాయవాదులను, రాజకీయ ఖైదీల కుటుంబాల వారిని అరెస్టు చేశారా! వగైరా వివరాలను సేకరించి, వీటిని కాపీలు తీయించి దేశంలోని వివిధ పౌరహక్కుల సంఘాలకు, ప్రజాసంఘాలకు, బార్ అసోసియేషన్లకు, జిల్లా కోర్టు జడ్జి నుండి సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ వరకూ కేంద్ర–రాష్ట్ర మానవాధికార కమీషన్లకూ, విదేశాల్లోని పౌరహక్కుల సంఘాలకూ, ఐక్యరాజ్య సమితి (యు.ఎన్.ఓ.)కూ పంపాలి. ఖైదీల కుటుంబాలు, ఈ సమస్యపై పనిచేసే సంస్థలు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించేలా చూడాలి. పార్టీ ఫ్రాక్షన్స్ సంబంధిత సంఘాలు, పౌరహక్కుల సంఘాలు ప్రచార, ఆందోళన కార్యక్రమాలు తీసుకునేలా, ఇతర విప్లవ–ప్రజాస్వామిక సంఘాలు ఇందుకు తోడ్పడేలా చూడాలి. సంబంధిత సంఘాలు, పౌరహక్కుల సంఘాలు రాజకీయ బందీల సమస్యలపై పనిచేసే విదేశీ సంస్థల ప్రతినిధులను మన దేశానికి ఆహ్వానించాలి. వారు వివిధ జైళ్లను సందర్శించి రాజకీయ ఖైదీల స్థితి గురించి పరిశీలించి దేశంలో, విదేశాల్లో బహిర్గతపరిచేలా చూడాలి.

ఈ సందర్భంగా జైళ్లలో సాధారణ ఖైదీలను కలుపుకొని రాజకీయ ఖైదీలు వివిధ పోరాట రూపాలు – నిరాహార దీక్ష, ప్రదర్శన వంటివి చేపట్టాలి. జైళ్లను పోరాట కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. మన పార్టీ అవగాహనతో జైలు కమ్యూన్లను నిర్మించాలి, బలోపేతం చేయాలి. జైలు బయట ఖైదీల విడుదల కోసం హక్కుల కోసం ప్రజలను, ఖైదీల కుటుంబాలను, స్నేహితులను పెద్దెత్తున సమీకరించాలి. సెప్టెంబర్ 13 రాజకీయ ఖైదీల విడుదల పోరాట దినం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. ఇందులో విప్లవ, ప్రజాస్వామిక, ప్రగతిశీల, జాతివిముక్తి పోరాట శక్తులను సమీకరించాలి. నిరసన ప్రదర్శనలు, ధర్నాలు మొదలైనవి చేపట్టాలి. రాజకీయ ఖైదీలపై మోపిన నేరాల వెనుక సామాజిక నేపథ్యం ఉందనీ, సామాజికంగా వాటిని పరిష్కరించకుండా జైళ్లల్లో బంధించి శిక్షించడం అప్రజాస్వామికం అనీ, కనుక రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్‌ను పెద్దెత్తున ప్రచారం చేయాలి.

**డిమాండ్లు :**

1) రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి.

2) సామాజిక, రాజకీయ పోరాటాల్లో అరెస్టయి జైళ్లలో మగ్గుతున్న వారందరికీ రాజకీయ ఖైదీ హోదాను కల్పించాలి.

3) ఉపా (యు.ఏ.పి.ఏ.), వివిధ రాష్ట్రాల్లో భద్రతా చట్టాలు, అఫ్స్పా (ఏ.ఎఫ్.ఎస్.పి.ఏ.) వంటి క్రూర చట్టాలను రద్దు చేయాలి. రాజద్రోహం చట్టాన్ని భారత శిక్షా స్మృతి నుంచి తొలగించాలి. ఈ చట్టాల కింద అరెస్ట్ చేసిన వారందరినీ వెంటనే బేషరతుగా విడుదల చేయాలి.

4) జైళ్లలో ఖైదీల, ప్రత్యేకించి రాజకీయ ఖైదీల, మహిళా ఖైదీల హక్కుల హననాన్ని, వారిపై కొనసాగుతున్న అణచివేత, అత్యాచారాలను ఆపాలి.

5) జైలు మాన్యువల్లను సంస్కరించాలి. వాటికి అనుగుణంగా జైలు పరిస్థితులను మెరుగుపర్చాలి.

6) ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా కొనసాగుతున్న మిషన్ 2017 ఫాసిస్టు దాడిని ఆపాలి.

7) అన్యాయానికి వ్యతిరేకంగా మాట్లాడేవారి గొంతు నులమడాన్ని ఆపాలి.

8) దేశ ప్రాకృతిక వనరులను రక్షించుకునేందుకు మూలవాసులు సాగిస్తున్న పోరాటాలపై అణచివేతను తక్షణం నిలిపివేయాలి.

9) కశ్మీర్, నాగాలాండ్, అసోం, మణిపూర్, బోడోలాండ్ తదితర జాతుల పోరాటాలపై, ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడుతున్న గూర్ఖాలాండ్ వంటి ఉద్యమాలపై ప్రభుత్వ కిరాయి బలగాల పాశవిక అణచివేతను ఆపాలి.

10) కార్మికులు, రైతులు తదితర పీడిత వర్గాలు, విద్యార్థి-యువజనులు, ప్రొఫెసర్లు, మతమైనారిటీలు, దళితులు, మహిళలు తదితర పీడిత సెక్షన్లపై మనువాద, బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు దాడిని ఆపాలి.

తేది : 17-7-2017

విప్లవాభినందనలతో

**కేంద్రకమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**